క్లుప్తంగా

42వ డివిజన్‌లో పార్కులు ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 42వ డివిజన్ పరిధిలో రూ. 50లక్షల నిధులతో నిర్మించిన పార్క్‌లను మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు. శుక్రవారం కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, పార్టీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్‌తో కలిసి రాయన భాగ్యలక్ష్మి పార్కులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. డివిజన్ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలని , పిల్లలకు ఆటలాడుకునేందుకు వీలుగా పార్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ఎండీ ఆసిఫ్. నాగవరపు శివయ్య. కె ఆంజనేయరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి. పి సుబ్బారెడ్డి, అఫ్సర్, మజ్జి శ్రీనివాసరావు. తదితర నాయకులు పాల్గొన్నారు

పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా రజనికి అభినందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ క్వీన్ ఆఫ్ క్రాఫ్ట్స్‌గా పేరుగాంచిన మేడా రజని కళా నైపుణ్యాన్ని కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రశంసించారు. కాదేదీ కళకు అనర్హం అని నిరూపిస్తూ పనికి రావనుకున్న పేపర్ ముక్కలతో రమణీయమైన కళాకృతులను చేయడం ఆమెకే చెల్లిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మేడా రజని పేపర్ తో తాను రూపొందించిన పూల బొకే, పేపర్ క్విల్లింగ్ ఆర్ట్ కలెక్టర్ ఢిల్లీరావుకు అందజేశారు.

నలందలో ఎలక్ట్రో 2కే 24



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎలక్ట్రో 2కే 24 ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, సర్క్యూట్ డిబగ్గింగ్, టెక్నికల్ క్విజ్, ఫ్రీ ఫైర్, లూడో, ట్రెజర్‌హంట్, మిస్టర్ అండ్ మిస్ ఎలక్ట్రో పోటీలు నిర్వహించారు. డ్రోన్, స్పైడర్ ఫైటింగ్, రోబో, ఆటోమేటిక్ టెంపరేచర్ డిటెక్టర్, రోబోటిక్, ఐటీ బేస్డ్ అప్లికేషన్స్‌తో చేసిన పలు ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పట్టేటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎలక్ట్రానిక్స్ హెచ్‌ఓడీ కె.రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో మరిన్ని వసతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థాన వేద పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఈవో కె.ఎస్. రామారావు ఆలయ అధికారులకు సూచించారు. పోరంకిలోని దేవస్థాన వేద పాఠశాలను ఈవో రామారావు శుక్రవారం పరిశీలించారు. వేద పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వేద విద్య, ఇతర వసతులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులను , వేద పాఠశాల పర్యవేక్షకులతో చర్చించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, ఇతర వసతుల ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వేద పాఠశాల సిబ్బంది, ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్.. సెలూన్‌లపై స్పెషల్ డ్రైవ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బ్యూటీ పార్లర్, ఏసీ సెలూన్‌ల పేరిట ఎటువంటి అసాంఘిక, అశ్లీల కార్యకలాపాలకు పాల్పడినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని సీజ్ చేస్తారని వెస్ట్ ఏసీపీ పి. మురళీకృష్ణారెడ్డి హెచ్చరించారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని బ్యూటీ పార్లర్, ఏసీ సెలూన్‌లపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని కొత్తపేట, కోమల విలాస్, పంజా సెంటర్, గణపతి రావు రోడ్డు, కేటీ రోడ్డు పరిధిలో ఉన్న 11 బ్యూటీపార్లర్లు, 5 ఏసీ సెలూన్లను తనిఖీ చేశారు. ఏసీపీ పర్యవేక్షణలో కొత్తపేట సీఐ గణేష్, వెస్ట్ వీఆర్వో రాజశేఖర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.రాజకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఏడీఎఫ్‌వో శ్రీధర్, ఏఎంహెచ్‌వో వి.రామకోటేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, సీఎస్‌టీవో శాఖల ప్రతినిధులతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ పీఎస్ పరిధిలోని వివిధ బ్యూటీపార్లర్లు, సెలూన్లపై స్థానిక ఏసీపీ ఆధ్వర్యంలో సీఐ ఇతర అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి, మున్సిపల్, రెవెన్యూ, లేబర్ ఆఫీసర్, చైల్డ్ అండ్ వెల్ఫేర్ వారందరితో కలిసి తనిఖీలు చేశారు.

జగనన్నకు అండగా నిలవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తూ వారికి సముచిత స్థానాలు కల్పించారని, అటువంటి జగనన్నకు ఎస్టీలంతా అండగా ఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. గొల్లపూడి బైపాస్ రహదారి పక్కన పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ నాయకుడు, దుర్గగుడి పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య ఆధ్వర్యంలో ఎస్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆసిఫ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా తమవారని పదేపదే ఉద్ఘాటించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత వారందరిపై ఉందన్నారు. ప్రధానంగా గా ఎస్టీ సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఎస్టీలకు చేసిన మంచిని, జగనన్న ప్రభుత్వంలో చేసిన మేలుకు బేరీజు వేసుకుంటే తెలిసిపోతుందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మాటలతో మభ్యపెట్టటం మినహా ఎస్టీలకు చేసిందేమీ లేదనా అన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగనన్న అన్నివర్గాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం జగనన్నను తమ ఇంటికి పెద్ద కొడుకుగా ఆశీర్వదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, మండేపూడి చటర్జీ, మైలవరపు మాధురి లావణ్య, పీ చైతన్య రెడ్డి, ట్రికార్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ, ఎస్టీ నాయకులు కుంభా రామ జోజి, కె.ఆంజనేయులు, కుంభా నాగరాజు, కుంభా శ్రీనివాసరావు, పాలపర్తి ఆంజనేయులు, కుంభా కృష్ణవేణి, కుంభా విజయలక్ష్మి, కె వెంకయ్య, రాధయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫ్, పక్కన కట్టా సత్తెయ్య, మేయర్ భాగ్యలక్ష్మి

చేసిన మంచే గెలిపిస్తుంది

వించిపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి, సంక్షేమంతో సంతోషంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వారికి చేసిన మంచే తమ పార్టీని గెలిపిస్తుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు.

స్థానిక 50వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, 50వ డివిజన్ ఇన్‌చార్జి బంకా విజయలక్ష్మితో కలసి ఆసిఫ్ డివిజన్‌లోని ప్రతి ఇంటిని సందర్శించి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ హన్‌రెడ్డి నేతృత్వంలో నగరాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే కొండప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు, మెట్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులు, రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నా వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేసిందనే నమ్మకంతోనే ధైర్యంగా ఓట్లను అడిగేందుకు ప్రజల ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అర్హతే కొలమానంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిపక్ష కార్పొరేటర్ ఉన్న 50వ డివిజన్‌లో కూడా ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేసి ప్రారంభించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బంకా శివ, చాముండేశ్వరి, సైకం సాయిబాబు, దుర్గాసి కోటేశ్వరరావు, బదిత బోయిన రాము తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సభ జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ మనం ఏదైనా వస్తువును కొనుగోలు చేసి మోసపోతే వినియోగదారుల రక్షణకు చట్టాలు ఉన్నాయన్నారు. వాటితో నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పొందే హక్కు, ప్రాథమిక అవసరాలు పొందే హక్కు, వస్తువులు, సేవలను ఎంపిక చేసుకునే హక్కు, ఉత్పాదకాల గురించి తెలుసుకునే హక్కు ఉన్నాయని వివరించారు. జనశిక్షణ సంస్థాన్ సీనియర్ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారుల ఉద్యమ పితామహుడు రాల్ఫ్‌నాడర్ కృషితో ఈ రోజు అంతర్జాతీయ వినియోగదారుల ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయని, వీటితో వినియోగదారుల సంరక్షణ, సంక్షేమం, సేవలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును, సేవలను కొనుగోలు చేయడం సర్వసాధారణమని చెప్పారు. ఆ వస్తువులు, సేవల్లో ఏదైనా లోపం వస్తే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, శిక్షణార్థులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగళ్ల విద్యాకన్నా

హక్కులను పరిరక్షించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల హక్కులను గుర్తించి రక్షించుకోవాలని, ఆ హక్కులను దెబ్బతీసే మార్కెట్ దుర్వినియోగాలు, సామాజిక అన్యాయాలను నిరసించడానికి కృషి చేయాలని హైకోర్టు న్యాయవాది వీవీపీ ధర్మరాయుడు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వినియోగదారుల హక్కుల వినియోగంపై వివరించారు. హైకోర్టు న్యాయవాది గంగవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన వస్తువులు, సేవలు వారి తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా తీర్చాలన్నారు. బీఐఎస్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి. కృష్ణవీర్‌వర్మ మాట్లాడుతూ సమాచారం పొందే హక్కు వినియోగదారులకు ఉంటుందన్నారు. అఖిల్ భారతీయ గ్రాహక్ పంచాయతీ సతీష్ నానపనేని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి వినియోగదారుల హక్కులపై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డాక్టర్ సి. బ్రహ్మయ్య ,విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీలకు చంద్రబాబు వెన్నుపోటు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో మైనార్టీలకు ఒక్క ఇల్లు కూడా ఇచ్చిన దాఖలాలు లేవని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. ఈ రోజు మైనార్టీల సంక్షేమంటూ డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకొని మైనార్టీలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. శుక్రవారం భవానీపురం హెచ్‌బీ కాలనీలోని నూర్ ఏ ఇలాహీ మసీదులో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. ఆసిఫ్ మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇక్బాల్, మసీదు పెద్దలు పీరన్ సాబ్, కుర్షీద్, జమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీ కాలనీ నూర్ ఏ ఇలాహీ మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో షేక్ ఆసిఫ్

పారిశుద్ధ్య కార్మికులకు అందుబాటులో శానిటరీ కార్యాలయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ కార్యాలయం అందుబాటులో ఉండటంతో వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 47వ డివిజన్ కలరా హాస్పటల్ సమీపంలోని నగరపాలక సంస్థ సర్కిల్–1 ఆఫీస్ వద్ద రూ.16.54లక్షలతో నిర్మించిన శానిటరీ ఇనస్పెక్టర్ కార్యాలయం, రూ.17.35లక్షలతో నిర్మించిన శానిటరీ సూపర్‌వైజర్ కార్యాలయాన్ని ఆయన, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య సిబ్బందికి ఈ కార్యాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకటరమణ, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి శ్రీనివాస్, కార్పొరేటర్ యలకల చలపతిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, కూరాకుల నాగ, కామళ్ల జోజి, సోమిశెట్టి వెంకటేష్, వరకాల జోషి, పాండు, శివ రాజేష్, మోహన్, నన్నం దుర్గ, కామళ్ల కిషోర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన షేక్ మెహర్రాజ్‌ను చిట్టినగర్ ఈద్గామ హాల్ కమిటీ, యువత సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. చిట్టినగర్ మోతీ మసీదు ఆవరణలోని షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెహర్రాజ్‌ను శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతికి పాటుపడుతున్న మెహర్రాజ్‌కు తగిన గుర్తింపు లభించిందన్నారు. తనకు తగిన గుర్తింపు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ జాయింట్ సెక్రటరీ సుభాని, కోశాధికారి పఠాన్ రషీద్‌ఖాన్, యూసఫ్, అక్రం, యాసిన్, చాంద్ బాషా, రఫీ తదితరులు పాల్గొన్నారు.



మెహర్రాజ్‌ను సత్కరిస్తున్న ఈద్గామహల్ కమిటీ, యువత ప్రతినిధులు

మద్యం సీసాల స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిల్స్‌ను కొత్తపేట పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర శుక్రవారం తెల్లవారుజామున గస్తీ నిర్వహిస్తుండగా, జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అతను మద్యం విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడి వద్ద లభించిన సంచిలో 10 బీర్ బాటిల్స్, రెండు మద్యం బాటిల్స్‌ను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

‘పశ్చిమ’లో రోడ్డెక్కిన జనసేన

పోతిన మహేష్‌కు మద్దతుగా ధర్నా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో పోతిన మహేష్‌కు జనసేన తరఫున సీటు కేటాయించాలంటూ ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తుల్లో భాగంగా పశ్చిమ సీటును బీజేపీకి కేటాయిస్తారనే సమాచారంతో పెద్ద ఎత్తున మహేష్ అభిమానులు చిట్టినగర్ సెంటర్‌కు చేరుకున్నారు. సెంటర్‌లోని మరుపిళ్ల చిట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం చిట్టినగర్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించారు. జనసేనకు మద్దతుగా నినాదాలు చేస్తూ పశ్చిమ సీటును మహేష్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహేష్ అభిమానులు మాట్లాడుతూ జనసేన ఆవిర్భావం నుంచి మహేష్ జెండా పట్టుకుని పోరాటాలు చేశారన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణే ఒక సందర్భంలో మాట్లాడుతూ ఉద్యమం గురించి మాట్లాడాలంటే మహేష్‌ను చూసి నేర్చుకోవాలని చెప్పారన్నారు. బీసీ కులాలకు న్యాయం చేయాలంటే మహేష్‌కు సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పదేళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి అని, పార్టీకి ఒక బ్రాండ్ అన్నారు. మహేష్ సైనికులుగా, ఆయన మద్దతుదారులుగా శనివారం నిరసన దీక్ష చేస్తామన్నారు. ధర్నాలో రాంపిళ్ల శ్రీనివాసరావు, గుజ్జారి అమర్‌బాబు, రాయన ఆదిబాబు, లింగిపిల్లి అప్పారావు, తమ్మిన హేమంత్, లక్ష్మణరావు, రామకృష్ణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



చిట్టినగర్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించిన జనసేన నాయకులు, కార్యకర్తలు

నగరంలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: నగరంలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు మరో 50 రోజులు పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ శనివారం నుంచి మే నాలుగో తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఆంక్షల సమయంలో నలుగురు, అంతకు మించిన వ్యక్తులు ఒకే చోట గూమిగూడవద్దని, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరించకూడదని హెచ్చరించారు. సిటీలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టు టౌన్, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, పటమట, మాచవరం, గుణదల, సత్యనారాయణపురం, సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వివరించారు.

ముస్లిం కమిటీలో యువతకు ప్రాధాన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. శుక్రవారం 63వ డివిజన్‌లో ముస్లిం యువతతో సమావేశం నిర్వహించారు. అనంతరం సెంట్రల్ నియోజకవర్గం ఆజాద్ ముస్లిం కమిటీ యూత్ అధ్యక్షుడిగా ఎం.అన్వర్‌బేగ్, ఉపాధ్యక్షునిగా ఎం.సర్వర్‌బేగ్, ప్రధానకార్యదర్శి షేక్ జానీ బాషాను నియమించారు.

పేదల సొంతింటి కల సాకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదలు కొన్నేళ్లుగా సొంతింటి కోసం కన్న కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. విద్యాధరపురం పరిధిలోని 44 డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ఆధ్వర్యాన నాలుగు స్తంభాల సెంటర్ కొండపైన, 45 డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య ఆధ్వర్యంలో కబేళా సమీపంలో సచివాలయం పరిధిలోని కొండ ప్రాంత నివాసితుల ఇళ్ల పట్టాలపై హక్కులు కల్పిస్తూ జారీ చేసిన పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేతగా 3648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజలతో మమేకమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కష్టాలను తెలుసుకున్నారని గుర్తు చేశారు. కొండ ప్రాంతంలో నివసించేవారి ఇళ్లపై సంపూర్ణ హక్కులను కల్పిస్తూ పట్టాలను పంపిణీ చేశారు. పశ్చిమకు చెందిన పలువురు పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం పాలనలో టిడ్కో ఇళ్ల పేరుతో పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన చంద్రబాబు వారికి ఇవ్వకుండా దగా చేశాడని గుర్తు చేశారు. జగనన్న మళ్లీ గెలిపిద్దామని కోరారు.

44వ డివిజన్‌లో 1,074, 45వ డివిజన్‌లో 725 పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, పార్టీ నాయకులు వీరంకి సత్యనారాయణ, వల్లెపు రాము, అద్దేపల్లి సత్యనారాయణ, రమణ, ముత్తా వాసు తదితరులు పాల్గొన్నారు.



44వ డివిజన్‌లో పట్టాలను అందజేస్తున్న ఆసిఫ్

ఇమామ్, మౌజాన్లను మోసం చేసిన చంద్రబాబు: ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ హయాంలో మసీదు ఇమామ్‌లు, మౌజాన్లకు కేవలం మూడు వేలు, ఐదు వేలు చొప్పున, అదీ అరకొరగా ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు ఈ రోజు ముస్లిం మైనార్టీలపై ప్రేమ ఒలక బోస్తున్నాడని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ విమర్శించారు. రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా పున్నమి ఘాట్ సమీపంలోని మొహమ్మదీయ మసీదులో ఆయన ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజాన్లకు రూ.5వేలు, రూ.10వేలు చొప్పున ఇస్తూ వారిని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, మసీదు ముతవలి ఎండీ అస్గర్, రహీం ఖాన్, ఎండీ ఇక్బాల్, షేక్ నజీర్, షేక్ బాజీ బాబా, బడేమియా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అమ్మవారి ఆలయ మహా మండపం 7వ అంతస్తులోని కళావేదిక వద్ద శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు, పాలక మండలి సభ్యులు, ఉభయదాతలు, భక్తులు, పాల్గొన్నారు. ప్రతి మాసం షష్టిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులున్నా, సంతాన, వివాహ యోగం లేని వారు కల్యాణోత్సవంలో పాల్గొని సేవ చేసుకునే వారికి సమస్య పరిష్కారమవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం కళావేదిక వద్ద నుంచి స్వామి వారి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా పుట్ట వద్ద ఆలయానికి తీసుకెళ్లారు.



స్వామి వారి కల్యాణోత్సవం

20, 21 తేదీల్లో సిద్ధార్థలో వర్క్‌షాప్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఈ నెల 20, 21 తేదీల్లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ సహకారంతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్సెస్‌పై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొనవచ్చన్నారు. బెంగుళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్వీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు వర్క్‌షాప్‌లో పాల్గొంటే కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. డాక్టర్ టి.శ్రీనివాస కృష్ణ,అధ్యాపకులు, విద్యార్థులు వర్క్‌షాప్ వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సెంటినీలో 10 వేల యూరాలజీ సర్జరీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సెంటినీ హాస్పటల్స్‌లో పది వేల యూరాలజీ సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో 8 సంవత్సరాలుగా సేవలందిస్తున్న చీఫ్ యూరాలజిస్ట్ డాక్టర్ అజయ్‌కుమార్ నేతృతంలో ఆ విభాగం మైలురాయిని చేరుకుందన్నారు. సెప్టెంబరు 2015 నుంచి ఇప్పటి వరకూ 10 వేల సర్జరీలు విజయవతంగా పూర్తి చేసుకున్నట్లు ఆమె తెలిపారు. డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ జనరల్ యూరాలజీ సర్జరీలే కాకుండా, పిడియాట్రిక్ యూరాలజీ, అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపి, మినిమల్లీ ఇన్వేసివ్ లేజర్ ఎండోయూరాలజీ, రికన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. యాజమాన్యం సహకారం, వైద్యులు రాధామాధవి, ప్రసాద్, అనిత, దీప్తిల సహకారంతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. సమావేశంలో చైర్మన్ మొవ్వ ఆనంద్, డైరెక్టర్ విష్ణు మొవ్వ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పద్మ మొవ్వ, యూరాలజిస్ట్ డాక్టర్ అజయ్‌కుమార్, ఆనంద్ మొవ్వ, తదితరులు

ఒలింపియాడ్‌లో ‘చైతన్య’ ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇండియన్ నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ చైతన్య విద్యాసంస్థలకు చెందిన భాస్కర్ భవన్ స్కూల్ కాంపౌండ్‌లో 10వ తరగతి విద్యార్థి రాపోలు గౌతమ్‌కుమార్ ప్రతిభ చూపి తదుపరి రౌండ్ (ఐఎంఓటీసీ)కి ఎంపిక అయ్యాడని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. భాస్కర్ భవన్ స్కూల్ ఆవరణలో గౌతమ్‌కుమార్‌ను శుక్రవారం అభినందించారు.



గౌతమ్‌కుమార్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

● పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పరీక్షల నేపథ్యంలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్లో విద్యార్థులకు పరీక్షల మెటీరియల్స్ అందజేశారు. హైస్కూల్ లో చదువుతున్న 153 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, జామెట్రీ బాక్సులు, స్కేల్స్, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. జిల్లా సైన్సు అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు డి.మోహన్ పాల్గొన్నారు.